క్లుప్తంగా

కోలా గురువులుకు అభినందన



కోలా గురువులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులుకు ప్రమాణ స్వీకారం సందర్భంగా జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 92వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, కంపర కోటేశ్వరరావు, గొంతిన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ విద్యార్థులకు కానుకల అందజేత



పిల్లలకు బహుమతులు ఇస్తున్న మహిళలు

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ లేడీ క్లబ్ మెంబర్స్ (యారాడ పార్కు) ఆధ్వర్యంలో స్థానిక నేత్ర విద్యాలయ విరాజ్ ఆశ్రమంలో చదువుకుంటున్న చిన్నారులకు పలు కానుకలు అందజేశారు. ఆశ్రమం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ మెంబర్స్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో నేత్ర విద్యాలయ విరాట్ ఆశ్రమానికి కుక్కర్, మిక్సీ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారం, వస్త్రాలు అందించామన్నారు. క్లబ్ మెంబర్స్, ఆశ్రమ, నిర్వాకులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



శాంతినగర్‌లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మేరకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శనివారం పనులను స్వయంగా పరిశీలించారు. నాణ్యతా లోపాలు లేకుండా పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శాంతినగర్ పార్కు రోడ్డులో రూ.19 లక్షలతో బీటీ రోడ్డు పనులు చేపట్టామని తెలిపారు. త్వరలో ఈ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ఆయనతో పాటు ఏఈ ఉష, ఇంజినీరింగ్ సిబ్బంది అనూప్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులదే కీలకపాత్ర



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

గోపాలపట్నం: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఆంధ్ర ప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం (అపుస్మా) రాష్ట్ర చీఫ్ మెంబర్, రామకృష్ణ పాఠశాల యజమాని ఎ.రామకృష్ణారెడ్డి అన్నారు. ఎన్‌ఏడీలోని రామకృష్ణ పాఠశాలలో శనివారం టీచర్ ఎన్‌రీచ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి స్వేచ్ఛగా తమ సందేహాలను అడిగే విధంగా టీచర్, విద్యార్థి మధ్య సంబంధాలు ఉండాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని.. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుని తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్లు హైస్కూల్ ఉపాధ్యాయులకు విద్యా బోధనలో మెళకువలు నేర్పించారు. ఈ తరగతులకు జిల్లాలోని 65 పాఠశాలల నుంచి 300 మందికి పైగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు, జిల్లా కోశాధికారి జి.శేషగిరిరావు, పలు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దానిమ్మ మొక్కకు అంటుకడుతున్న లొడగల రాజు యాదవ్



గుల్లలపాలెం వుడా కాలనీలోని రాజు యాదవ్ డాబాపై పారిజాతం, మల్లె పాదులు, పూల మొక్కలు

SUNDAY SPECIAL

పచ్చని పొదరిల్లు

- ఇంటి డాబాను నర్సరీలా మార్చిన కేబుల్ వ్యాపారి
- పూలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరల మొక్కల పెంపకం



పూలు, కూరగాయల మొక్కలు

మల్కాపురం: మొక్కల పెంపకం.. ఆయన హాబీ. బాల్యం నుంచి దీనిపై మక్కువ పెంచుకున్నారు. తన ఇంటినే ఆకుపచ్చని పొదరిల్లుగా మార్చుకుని ఎన్నో రకాల మొక్కలు పెంచుతూ అందులోనే ఆనందం పొందుతున్నారు. ఆయన ఇంటికి వెళ్తే ఒక సుగంధభరిత సువాసన ఆహ్వానిస్తుంది. ఇంటి ముఖద్వారం వద్దే పారిజాత పుష్పాల పరిమళాలు మైమరిపిస్తాయి. కాస్తా ముందుకు వెళ్తే మల్లెపూల వాసన రా..రమ్మంటుంది. ఆ ఇంటి వద్ద అడుగడుగునా పూలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరల మొక్కలు దర్శనమిస్తుంటాయి.

గుల్లలపాలెం పోదాం రండి..

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీలో లొడగల రాజు యాదవ్ అనే వ్యక్తి రెండంతస్తుల భవంతి కలిగి ఉన్నాడు. ఇతను కేబుల్ వ్యాపారి. ఈయనకు చిన్నతనం నుంచే మొక్కలు పెంచడం ఒక హాబీ. ప్రస్తుతం తను నివసిస్తున్న మేడపై ఖాళీ ప్రదేశాన్ని చక్కని తోటగా మలిచారు. పారిజాతం, మల్లె పాదులతోపాటు గులాబీ, మందారం, బంతి మొదలగు పూల మొక్కలు.. బీరకాయ, దొండకాయ, వంకాయలు, టమాటా, బంగాళదుంప వంటి కూరగాయలు.. ద్రాక్ష, దానిమ్మ, నిమ్మ, జామకాయ వంటి పండ్ల మొక్కలు.. గోంగూర, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు వంటి ఆకుకూరల మొక్కలు నాటారు. వీటి పెంపకానికి ఎటువంటి రసాయనాలు ఆయన వినియోగించడం లేదు. కేవలం ఆవు గెత్తం, పులిసిన పెరుగు, గెంజి, వేప నూనె మాత్రమే పిచికారీ చేస్తున్నారు. ఇలా వందకు పైగా వివిధ రకాల మొక్కలను ఆ వ్యక్తి పెంచుతున్నాడు. ఇందుకోసం ఆయనకు పెద్దగా ఖర్చు కూడా అవ్వదంటా. మొక్కల పెంపకం ద్వారా తన ఇంటికి అవసరమైన కూరగాయలు, ఆకుకూరలు సమకూర్చుకుంటున్నారు. లొడగల రాజు చిన్ననాటి హాబీ.. పర్యావరణ పరిరక్షణతోపాటు ఇలా తనింటికి ఉపయోగపడుతోంది.



ద్రాక్ష పాదు

మొక్కల పెంపకంలో ఎంతో సంతృప్తి

మా ఇంటి మేడపై ఖాళీ ప్రదేశాన్ని నిరుపయోగంగా ఉంచకుండా వివిధ రకాల మొక్కలు పెంచుతున్నాను. పచ్చదనం పెంపుతోపాటు కాలుష్య నియంత్రణకు నా వంతు కృషి చేస్తున్నాను. తద్వారా ఆరోగ్యకరమైన పంటలు మాకు లభిస్తున్నాయి. ఇంటికి నెలకు సరిపడా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు లభిస్తుంటాయి., వాటిలో కొంతభాగం నా స్నేహితులకు ఇస్తుంటాను. మొక్కల పెంపకం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

– లొడగల రాజుయాదవ్, గుల్లలపాలెం వుడా కాలనీ

ప్రజారోగ్యానికి ఏటీఆర్ ట్రస్టు భరోసా



వైద్య శిబిరంలో సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గ ప్రజలంతా ఆరోగ్యవంతులుగా ఉండాలనే ఆలోచనతో తన తండ్రి ఆడారి తులసీరావు(ఏటీఆర్) పేరిట ఏర్పాటు చేసిన చారిటబుల్ ట్రస్టు ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఏటీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 61వ వార్డు మల్కాపురం రిఫరల్(జీవీఎంసీ) ఆస్పత్రి వద్ద ఉచిత గుండె వైద్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అతిథిగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ ట్రస్టు ద్వారా పేద విద్యార్థులకు చదువు, పేద రోగులకు వైద్య సేవలు, దుస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలను పశ్చిమలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరుపేదలకు ప్రతి నెలా కొంత మొత్తం నగదు పింఛన్ రూపంలో అందజేస్తున్నామన్నారు. పేదల సేవలో ఎంతో సంతృప్తి ఉంటుందన్నారు. అనంతరం సుమారు 50 మందికి వైద్య సిబ్బంది గుండె వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, నాయకులు భోగవల్లి నాగభూషణం, కేబుల్ వాసు, కొల్లి నూకరెడ్డి, సోనూ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



62వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



చిన్నబాబురెడ్డి, ఆయన అనుచరులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికే రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 62వ వార్డు దుర్గానగర్ హైలెట్ వాటర్ ట్యాంక్ నుంచి త్రినాథపురం సెంటర్ వరకు సుమారు రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శనివారం కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, పార్టీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ఆయన శంకుస్థాపన చేశారు. ముఖ్య అతిథిగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ లేకుండా అత్యుత్తమ ప్రమాణాలు పాటించి, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో దుర్గానగర్ గ్రామ కమిటీ సభ్యులు, దుర్గానగర్ యూత్ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 100 మంది చేరిక

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు ఆకర్షితులపై వైఎస్సార్‌సీపీలో చేరే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, పార్టీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్ ప్రోత్సాహంతో కాంట్రాక్టర్ గేదెల చిన్నబాబు రెడ్డి, ఆయన అనుచరులు సుమారు 100 మంది శనివారం పార్టీలో చేరారు. దుర్గానగర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ జాన్‌ప్రకాశ్ పీపీసీ సభ్యులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చి ఆధ్వర్యంలో 159వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ద కిందట జ్ఞానాపురంలో కలరా వ్యాధితో అనేక మంది ప్రజలు మృత్యువాత పడ్డారన్నారు. బిషప్ పీటర్ రోస్సియోన్ సూచన ప్రకారం అలయ విచారణ కర్తలు దేవమాత (మరియమాత) స్వరూపం జ్ఞానాపురంలో నేలకొల్పి పురవీధుల్లో తేరును ఊరేగింపు చేస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయన్నారని తెలిపారు. నాటి నుంచి ఆ కార్యక్రమం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆగస్టు 1 మంగళవారం సాయంత్రం స్లీప్ గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలువీధుల్లో తిరుగుతుందని 15న జరిగే ప్రధాన మహోత్సవాలను విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ, పుర:ప్రదక్షిణ, బహుమతి ప్రదానం, భారీ బాణసంచాతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఫాదర్లు పి. ప్రభాకర్, వేళంగిణీరావు, పీపీసీ అధ్యక్షుడు వై.అమర్‌దీప్, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి చార్లీ, కార్యదర్శి పి.ఆనందరావు, కోశాధికారి జి.ఆనందరావు, గురు మండలి సలహా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఈట్ రైట్ మేళా'

- మిల్లెట్ మేళాలో ఆకట్టుకున్న స్టాల్స్
- అధిక సంఖ్యలో హాజరైన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు



మిల్లెట్స్ మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎండీ భట్



వాకథాన్‌లో పాల్గొన్న ఉక్కు నగర వాసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య స్పృహతో చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందన్నారు. దైనందిన జీవితంలో మిల్లెట్స్ వినియోగం, ప్రాధాన్యం గురించి డాక్టర్ అరుల్ ఆనంద్, సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, క్యూ1 ఇంటర్నేషనల్ ఫుడ్స్ సీఈఓ ఎస్. సుజాత శ్రీనివాస్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జి. సాంబశివరావు తదితరులు వివరించారు. మేళాలో సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మిల్లెట్లు, మిలెట్లతో చేసిన వంటకాలను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

ఉక్కు సెక్టార్లలో 'వాకథాన్'

ఈట్ రైట్ ఇండియా – 'సురక్షితంగా తినండి– ఆరోగ్యంగా తినండి– స్థిరంగా తినండి' నినాదంతో ఉక్కునగరంలో శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ముందుగా స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. సెక్టార్– 5 నుంచి సెక్టార్–1 మీదుగా అంబేడ్కర్ కళాక్షేత్రం గుండా సెక్టార్–6 వరకు వాకథాన్ సాగింది. అంతకు ముందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మల్కాపురం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు భద్రత కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు శనివారం రాజీవ్ గాంధీ అగ్రికల్చరల్ లేబర్ యూనియన్ (ఇంటక్) నాయకులు వినతిపత్రం అందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలకు రూ.18వేలు జీతం చెల్లించాలని, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాయకులు కె. వరహాలరాజు, భోగవిల్లి నాగభూషణం, వి.సత్యం, ఎర్నిబాబు, అప్పారావు, సన్యాసిరావు ఉన్నారు.

కార్మికులకు వైద్య బీమా



మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు రమణయాదవ్

మల్కాపురం: కార్మికులందరికీ వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సొసైటీ నాయకులు నిర్ణయించారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సొసైటీ కార్యవర్గ సమావేశం శనివారం ఆర్‌కేపురంలో నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణయాదవ్ మాట్లాడుతూ సొసైటీలో కార్మికులకు ఈఎస్ఐ సేవలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కార్మికులందరికీ ఇన్సూరెన్స్(వైద్యబీమా) చేయదలిచామన్నారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు.కార్యక్రమంలో పాలక వర్గ సభ్యులు చెల్లిబోయిన శ్రీనివాస్‌రావు,ఎస్.పైడిరాజు,వై.ఎ.భాస్కర్, చొప్ప అప్పలరాజు,వై.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి

మల్కాపురం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, గంగవరం పోర్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆదివారం చేపట్టనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని టీఎన్‌టీయూసీ నాయకులు కోరారు. పాదయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను 61వ వార్డు ఆర్‌కేపురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూర్మన్నపాలెం వద్ద దీక్ష చేస్తున్న స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల శిబిరం నుంచి గంగవరం పోర్టు వరకు పాదయాత్ర సాగుతుందన్నారు. మరలా అక్కడ నుండి గాజువాక,జింక్ మీదుగా మల్కాపురం వరకు పాదయాత్ర చేసి అక్కడ రాత్రి బస ఉంటుందన్నారు. సోమవారం మల్కాపురం నుంచి సింధియా మీదుగా కలెక్టర్ ఆఫీస్ వరకు పాదయాత్ర చేసి కలెక్టర్‌కు వినతి ఇస్తామన్నారు. నాయకులు ఆదినారాయణ, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పురందేశ్వరిపై మండిపడ్డ అఖిలపక్షం

దాబాగార్డెన్స్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఆమె మాటలు వింటుంటే తెలుగు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా.. కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా మారినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. విశాఖ ఎంపీగా.. కేంద్ర మంత్రిగా పని చేసి విశాఖకు, ఆంధ్ర రాష్ట్రానికి ఏమీ చేయకపోగా.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ పంచన చేరి, ఆ పార్టీకి అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు.

ఆడారి ఆనంద్‌కుమార్ దాతృత్వం

- సొంత నిధులతో ఇల్లు నిర్మించి వృద్ధ దంపతులకు అందజేత



వృద్ధ దంపతుల ఇంటిని ప్రారంభిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

సింధియా: కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడంలో ఎల్లప్పుడూ ముందుంటారని విశాఖ డైయిరీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మరోసారి నిరూపించారు. గతంలో 62వ వార్డు అంబేడ్కర్ కాలనీలో ఊడికల దాసు, సూరమ్మ అనే పేద వృద్ధ దంపతులు చిన్నపాటి పూరిగుడిసెలో నివసించేవారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ గుడిసె కూలిపోవడంతో వారు నిరాశ్రయులయ్యారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఈ విషయాన్ని ఆడారి ఆనంద్‌కుమార్‌కు తెలియజేశారు. ఆ వృద్ధ దంపతులను స్వయంగా ఆయన కలిసి ధైర్యం చెప్పి సొంత నిధులతో ఇల్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు త్వరితగతిన రేకుల ఇంటిని నిర్మించి శనివారం ప్రారంభించి వృద్ధ దంపతులకు ఆడారి అందజేశారు. వారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు



సంపత్ వేంకటేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



కలియుగ వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

కంచరపాలెం: అధిక శ్రావణ మాస శుద్ధ ఏకాదశి సందర్భంగా శనివారం వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదం అందించారు. సాయంత్రం నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, పవళింపు సేవ నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్ శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రియదర్శిని కాలనీలో సమస్యల తిష్ట



సిమెంట్ దిమ్మ లేని వీధి కాలువ



శిథిలమైన సీసీ రోడ్డు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ప్రియదర్శిని కాలనీలో పలు సమస్యలు వేధిస్తున్నాయి. వీధి కాలువలపై పైకప్పులు, కాలువపై సిమెంట్ దిమ్మలు 30 ఏళ్ల నాటివి కావడంతో విరిగిపోయాయి. దీంతో ఆ మార్గంలో నడవాలంటే పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇదే ప్రాంతంలో సీసీ రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. పలు చోట్ల సీసీ రోడ్డు బీటలు వారి ప్రమాదకరంగా మారింది. దీంతో ఇటు ద్విచక్ర వాహనాలు రాలేని పరిస్థితి ఉంది. ఈ సమస్యను కాలనీ వాసులు అధికారుల దృష్టికి నెల కిందట తీసుకువెళ్లారు. అయినా నేటికీ ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.